ప్రజాశక్తి
మంగళవారం 4 జులై 2023 | 5
శ్రీ సత్యసాయి

# గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

## నేడు సాయిహీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

**పుట్టపర్తి అర్బన్ :** రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పుట్టపర్తి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మంగళవారం నాడు ఆయన పుట్టపర్తిలో పర్యటించనున్నారు. సత్యసాయి ట్రస్టు ప్రశాంతి నిలయంలో నూతనంగా నిర్మించిన సాయిహీరా ఇంటర్నేషనల్ కన్వెషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. వర్చువల్ విధానం ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ దీనిని ప్రారంభించారు. పుట్టపర్తి నుంచి ఈ కార్యక్రమంలో గవర్నర్ నేరుగా పాల్గొంటారు. ఈ మేరకు ఆయన సోమవారం రాత్రే పుట్టపర్తికి చేరుకున్నారు. గవర్నర్ పుట్టపర్తికి రావడంతో ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. కలెక్టర్ అరుణ్‌బబు, ఎస్‌పి మాధవరెడ్డిలు ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ బసచేసే శాంతి భవన్ సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించారు. గవర్నర్ పర్యటన కోసం ఏర్పాట్లను పకడ్బందీగా చేశామన్నారు. మామిళ్లకుంట క్రాస్ నుంచి శాంతిభవన్ అతిథి గహం వరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

సిఐ ఆనందరావు (ఫైలఫొటో)

వివాదాలు, సంచనాలకు కేంద్ర బిందువు అయిన అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో మరో సంఘటన చోటు చేసుకుంది. నిత్యం రాజకీయ ఘర్షణలు చెలరేగే ఈ ప్రాంతంలో ఓ పోలీసు సర్కిల్ ఉన్నతాధికారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. ఈయన మృతిపై భిన్నవాదనలు విన్పిస్తున్నాయి. పని ఒత్తిడి అని కుటుంబ సభ్యులు చెబుతుండగా, రాజకీయ వేధింపులే కారణం అని ప్రతిపక్ష పార్టీల నాయకులు చెబుతున్నారు. పోలీసు మరణాన్ని కూడా రాజకీయాలకు వాడుకుని చిల్లర రాజకీయాలు చేయడం సరికాదంటూ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పేర్కొన్నారు. మొత్తం మీద తాడిపత్రి సిఐ ఆనందరావు ఆత్మహత్య వ్యవహారం సోమవారం నాడు తాడిపత్రిలోనే కాకుండా జిల్లాలో తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. పోలీసులు, కుటుంబ సభ్యులు స్థానికులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

# సిఐ ఆత్మహత్య

- ఇంట్లో ఉరేసుకుని మృతి చెందిన తాడిపత్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్
- మృతిపై పలు భిన్నవాదనలు
- రాజకీయ వేధింపులన్న జెసి.ప్రభాకర్‌రెడ్డి
- చిల్లర రాజకీయాలు తగదన్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి
- కుటుంబ కలహాలే కారణం : ఎస్పీ

**ప్రజాశక్తి తాడిపత్రి.**

తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఆనందరావు(51) విధులు నిర్వహిస్తున్నారు. 1998లో ఎస్ఐగా పోలీసు శాఖలో విధులు ప్రారంభించిన ఆయన తరువాత సిఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఏడాదిగా తాడిపత్రి సిఐగా విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని నంద్యాల రోడ్డు వద్ద అద్దె ఇంట్లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఆదివారం నాడు యథావిధిగా ఆయన విధులకు హాజరయ్యాడు. విధులు పూర్తయిన తరువాత రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి చేరుకున్నాడు. తనగదికి వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఆయన గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వేకువజామున 3 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఆనందరావు గదిలో చూడగా ఆయన ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే డీఎస్పీ గంగయ్య పట్టణ ఎస్ఐ ధరణి బాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిఐ మృతి విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసులు ఆసుపత్రికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై కుటుంబ సభ్యులతో ఆరా తీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం ఆనందరావు సొంతూరైన చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కల్లోడుపల్లి గ్రామానికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

**పెద్దఎత్తున చేరుకున్న పోలీసులు**

అందరితో మంచిగా ఉండే సిఐ ఆనందరావు ఆత్మహత్య విషయం తెలియగానే పోలీసు సిబ్బంది నిర్ఘాంతపోయూరు. సమాచారం తెలిసిన వెంటనే పెద్దఎత్తున పోలీసు అధికారులు అక్కడికి చేరుకున్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, తాడిపత్రి డీఎస్పీ గంగయ్య అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకులు త్రిలోక్, సుధాకర్‌రెడ్డి తదితరులు చేరుకుని నివాళులు అర్పించారు. పోస్టు మార్టం అనంతరం పోలీసు గౌరవ వందనం తెలియజేశారు.

**రాజకీయ కారణమా... కుటుంబ కలహాలా..!**

సిఐ ఆనందరావు మృతిపై భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. అధికారిక ఒత్తిళ్ల కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, కుటుంబ కలహాలన్న మరో వాదన వినిపిస్తోంది. భార్యకు ఆయనకు మధ్య కొంతకాలంగా గొడవలున్నట్టు సమాచారం. ఆదివారం రాత్రి కూడా ఇద్దరి మధ్య వాదనలు జరిగినట్టు తెలుస్తోంది. పని ఒత్తిడి వల్లనే తన తండి ఆత్మహత్య చేసుకున్నాడని సిఐ కూతరు మొదట మీడియాకు చెప్పినప్పటికీ తరువాత వ్యక్తిగత కారణాలతోనని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

**వృత్తిపరమైన ఒత్తిళ్లు లేవు : ఎస్పీ**

ఆనందరావు ఆత్మహత్య చేసుకున్న ఇంటిని ఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆనందరావు గత సంవత్సర కాలంగా తాడిపత్రిలో సిఐగా తన విధులను పూర్తి స్థాయిలో నిర్వహించారన్నారు. ఆయనకు ఎలాంటి వత్తిపరమైన ఒత్తిళ్లు లేవన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోందని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దర్యాప్తు తరువాత పూర్తి వివరాలు బయటకు వస్తాయని చెప్పారు.

**ఒత్తిడి ఉందని చెప్పేవారు సిఐ కుమార్తె భవ్య**

ఇటీవల విధి నిర్వహణలో ఒత్తిడి చాలా ఎక్కువగా ఉందని తరచూ నాన్న చెప్పేవారంటూ సిఐ ఆనందరావు కూతురు భవ్య సోమవారం ఉదయం ఆసుపత్రి వద్ద విలేకరులకు తెలిపారు. గతంలో కడప, తిరుపతి ప్రాంతాల్లో విధులు నిర్వహించిన సమయంలో ఇలా ఎప్పుడు ఒత్తిడికి గురైన సందర్భాలు లేవన్నారు. గత మూడు నెలలుగా తీవ్రంగా ఒత్తిడికి లోను అవుతున్నట్లు తమతో చెప్పేవారని ఆమె తెలియజేశారు.

**రాజకీయ ఒత్తిళ్లే కారణం మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి**

తాడిపత్రి సిఐ ఆనందరావు ఆత్మహత్యకు రాజకీయ ఒత్తిళ్లే కారణం అని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఆయన ఆనందరావు మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ ఒత్తిడి తట్టుకోలేకనే సిఐ ఆత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఓ కేసులో వైసీపీ నాయకుడిని చేర్చాల్సి ఉండగా ఆ నాయకుడిని కేసులో చేర్చరాదంటూ అధికార పార్టీ నాయకులు సిఐపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ఇదే విషయమై ఓ ఉన్నతాధికారి ఆఫీసులో వైసీపీ నాయకుడు, పట్టణ సిఐ, ఎస్ఐ ఆదివారం నాడు చర్చలు జరిపింది వాస్తవం కాదా అన్న విషయాలను బహిర్గతం చేయాలన్నారు.

**చిల్లర రాజకీయం చేయడం తగదు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి**

సిఐ ఆత్మహత్యను కూడా రాజకీయం చేసి, చిల్లర రాజకీయాలు చేయడం తగదని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. సిఐ ఆత్మహత్యపై జెసి.ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందించారు. సిఐ ఆనందరావు మతి చాలా బాధాకరం అన్నారు. సిఐ మృతిపై జెసి.ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. స్వార్థ రాజకీయాల కోసం జెసి బ్రదర్స్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. సిఐ మృతిపై అవసరం అయితే విచారణ జరిపించేందుకు సిద్ధంగా ఉన్నమని ఎమ్మెల్యే తెలిపారు.

సిఐకు నివాళి అర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, ఎంపీ గోరంట్ల మాధవ్

ఇంట్లో ఆనందరావు మృతదేహం

# సరి చేశారు..!

## ప్రజాశక్తి ఎఫెక్ట్

- అన్‌సెటిల్డ్ భూముల వ్యవహారంపై అధికారుల్లో కదలిక
- ప్రకంపన సృష్టించిన ప్రజాశక్తి కథనం
- ఆఘమేఘాలపై దిద్దుబాటు చర్యలకు శ్రీకారం
- ఆన్‌లైన్‌లో లేపాక్షి హబ్ పేరు తొలగింపు
- రైతులకు మద్దతుగా వ్యకాసం ఆందోళన
- ప్రజాశక్తికి రైతులు, ప్రజల కృతజ్ఞతలు



Adangal — నిన్న

సర్వే నెం : 452-7 | పూర్తి విస్తీర్ణం : 5.0
సాగుకు పనికి రాని విస్తీర్ణం : 0.0
సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం : 5.0
భూమి స్వభావం : డిపట్టా
శిస్తు (రూ.) : 0.25 | భూమి వివరణ : మెట్ట
జల ధారము : వర్షం | ఆయకట్టు విస్తీర్ణం : 0.0
ఖాతా నెంబరు : 123456
అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) : 5.0
పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) : లేపాక్షి నాలెడ్జ్ హబ్ (లేపాక్షి నాలెడ్జ్ హబ్)

Adangal — నేడు

సర్వే నెం : 452-7 | పూర్తి విస్తీర్ణం : 5.0
సాగుకు పనికి రాని విస్తీర్ణం : 0.0
సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం : 5.0
భూమి స్వభావం : డిపట్టా
శిస్తు (రూ.) : 0.25 | భూమి వివరణ : మెట్ట
జల ధారము : వర్షం | ఆయకట్టు విస్తీర్ణం : 0.0
ఖాతా నెంబరు : 123456
అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) : 5.0
పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) : UNSETTLED PROPERTY (UNSETTLED PROPERTY)

సోమవారం నాడు లేపాక్షి హబ్ పేరు మారుస్తూ అడంగల్‌లో అన్‌సెటిల్డ్ పేరుపై వచ్చిన జాబితా

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

చిలమత్తూరు మండలంలో అన్‌సెటిల్డ్ భూములను అండంగల్‌లో లేపాక్షి నాలెడ్జ్‌హబ్‌కు మారుస్తూ రెవెన్యూ అధికారులు చేసిన నిర్వాకంపై సోమవారం నాడు ప్రజాశక్తి పత్రికలో పక్కాగా ఏ'మార్చేశారు'..! అన్న శీర్షికతో వెలువడిన కథనం ప్రకంపనలు సృష్టించింది. ఈ కథనం వెలువడగానే సోమవారం నాడు మండల రెవెన్యూ అధికారుల్లో దడ పుట్టింది. ఉదయం తొమ్మిది గంటలకే అధికారులు కార్యాలయానికి చేరుకుని దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. దీనికి తోడు రైతులు, ప్రజలకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. వీరికి జనసేన నాయకులూ మద్దతు తెలిపారు. దీంతో ఉక్కిరిబిక్కిరైన అధికారులు ఆన్‌లైన్‌లో పేరు మార్పునకు ఆఘమేఘాల మీద చర్యలు తీసుకున్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు తహశీల్దార్ చేరుకుని వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రైతుల పట్టా భూములను లేపాక్షి హబ్ పేరుపై ఎలా మార్చారో అధికారులు సమాధానం ఇవ్వాలన్నారు. మిగులు భూముల పేరుతో రైతుల పట్టా భూములను లాగేసుకునే కుట్ర జరుగుతోందన్నారు. ఒక వేళ మిగులు భూములు అయినా వాటిని లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు ఎలా బదలాయిస్తారని ప్రశ్నించారు. లేపాక్షి హబ్‌కు భూములు కట్టబెట్టే కుట్రకు అధికారులు సహకరిస్తుండడం దుర్మార్గమన్నారు. ఆన్‌లైన్‌లో అన్‌సెటిల్డ్ కింద ఉన్న భూములను యథావిధిగా అలానే ఉంచాలని ప్రశ్నించారు. దీనిపై తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ సాంకేతిక సమస్య వల్లనే ఈ పొరబాటు జరిగిందన్నారు. పొరపాటున అన్‌సెటిల్డ్ భూములన్నీ లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములుగా మారాయన్నారు. కొంత సమయం ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఇందుకు వ్యకాసం నాయకులు, రైతులు ఒప్పుకోలేదు. తాము కార్యాలయంలోనే ఉంటామని, వెంటనే సమస్యను పరిష్కరించక పోతే ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. దీంతో చేసేది లేక రెవెన్యూ అధికారులు మొత్తం ఈ సమస్య దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. అరగంట సమయంలో లేపాక్షి హబ్ పేరుపై ఉన్న భూములను యథాప్రకారం అన్‌సెటిల్డ్ పేరుపై అడంగల్‌లో మార్చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను గుర్తించి వెంటనే కథనాన్ని ప్రచురించిన ప్రజాశక్తికి, తమ పక్షాన పోరాటం సాగించిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం నాయకులు వెంకటేష్, సిపిఎం నాయకులు లక్ష్మినారాయణ, రామచంద్ర, జనసేన నాయకులు రమణ, చిన్నా, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన వ్యకాసం నాయకులు, రైతులు

మెప్మా, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లతో సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

# చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించండి

**ప్రజాశక్తి-హిందూపురం**

పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్నా వీధి విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అధికారులకు ఆదేశించారు. సోమవారం వీధి విక్రయదారుల సమస్యలపై కమిషనర్ తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుత పురపాలక సంఘ వ్యాప్తంగా ఇప్పటికే గుర్తించిన వీది వ్యాపారులతో పాటు ఇంకా ఎవరైనఉంటే గుర్తించాలన్నారు. అందరికి ఒక ప్రత్యేక స్థలాన్ని గుర్తించాలన్నారు. దీంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వీరికి అందే సంక్షేమ పథకాలు అందరికి అందే విధంగా చూడాలని సూచించారు. గతంలో వీధి విక్రయదారుల కమిటీలో కమిషనర్‌తో పాటు ట్రాఫిక్ ఎస్ఐ, మెప్మా అధికారులు మాత్రమే ఉండే వారన్నారు. ప్రస్తుతం ఆహార భద్రత అధికారులను సైతం సభ్యులుగా చేర్చారన్నారు. అందరు కలిసి వారి అభివృద్ధికి సహకరిద్దామన్నారు. ఈ సమావేశంలో పట్టణ వీధి విక్రయదారుల సంఘం నాయకులతో పాటు ఆహార భద్రత అధికారిణి తస్లీమ్ పాల్గొన్నారు.

# ప్రణాళికతో ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

ఈనెల 8న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ ఎమ్.గౌతమి జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి పరిశీలించారు. కళ్యాణదుర్గంలోని ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్ ఎదురుగా ఉన్న సువిశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ వేదిక సభాస్థలం, ఇతర ఏర్పాట్లపై స్థానిక అధికారులతో కలిసి చర్చించారు. ధర్మవరం రోడ్డు వైపునున్న సిఎం హెలీప్యాడ్ పనులు, విఐపి, వివిఐపిల సిట్టింగ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఏర్పాటు చేస్తున్న వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. వాల్మీకి సర్కిల్ నుంచి బైపాస్ కూడలి వరకు కలెక్టర్ వివిధ శాఖ అధికారులతో కలిసి కాలినడకన నడుస్తూ ముఖ్యమంత్రి ప్రయాణించే రోడ్డు మార్గాన్ని తనిఖీ చేశారు. హెలీప్యాడ్ నుంచి సభ వేదిక వద్దకు గౌరవ ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు సంబంధించి రోడ్డు విస్తరణ, కంపచెట్ల తొలగింపు, విద్యుత్ స్తంభాల తొలగింపు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, పారిశుధ్య పనుల నిర్వహణ, పోలీసు భద్రత, బ్యారికేడ్ల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ పనులను వేగవంతంగా పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మార్కెట్ యార్డ్ ప్రాంగణానికి చేరుకుని డా॥వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. పూర్తయిన భవన నిర్మాణం పనులు సాంకేతిక పరికరాల ఏర్పాటు తదితర అంశాల గురించి సంబంధిత శాఖ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ నిశాంత్ రెడ్డి, అనంతపురం ఆర్డీవో మధుసూదన్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, జడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ సురేంద్ర, డిపిఒ ప్రభాకర్ రావు, డిఎల్‌డిఒ శంకర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్జాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కదిరి ఆర్డీవో రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జాన్‌తో పాటు జిల్లా కమిటీ సభ్యులు విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించలేమని విద్యార్థులు పాఠ్యపుస్తకాలు కొనుక్కోవాలని ఇంటర్ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. గత మూడు సంవత్సరాల నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించడం లేదన్నారు. పాఠ్య పుస్తకాలు అందించకపోతే ఇంటర్ విద్యార్థులు ఏ విధంగా చదువుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించకపోగా విద్యార్థులు ఫీజులు ద్వారా కట్టిన ఇంటర్ విద్యామండలి నిధులు మొత్తం నాడు నేడు పథకానికి దారి మళ్లించడాన్ని సిగ్గుచేటుగా భావిస్తున్నామన్నారు. వెంటనే ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించి ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షవర్ధన్, ఆంజనేయులు, ఆబిద్, అహ్మద్ భాషా, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

## ప్రజాశక్తి వార్తకు స్పందన

**మడకశిర:** నియోజకవర్గ పరిధిలోని నీలకంఠాపురం సమీపంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన జాతీయ రహదారి పనులను అధికారులు పూర్తి చేశారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన జాతీయ రహదారి పనులు ఇబ్బందుల్లో ప్రయాణికులు అన్న శీర్షికన ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిలిచిపోయిన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేశారు. రోడ్డు పనులు పూర్తి చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# స్పందన ఫిర్యాదుతో నీటి సమస్య పరిష్కారం

**హిందూపురం :** పట్టణంలోని రహమత్‌పురంలో తీవ్ర నీటి సమస్య ఉందని గత సోమవారం మున్సిపల్ కార్యాయలంలో సబ్ కలెక్టర్ కార్తీక్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆ ప్రాంత వాసులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ సమస్యను పరిష్కారించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి రహమత్‌పురంలో పర్యటించారు. నీటి సమస్యను అక్కడిక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఇఇతో పాటు ఎఇ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

**ప్రజాశక్తి - రొద్దం**

మండలంలోని తురకాలపట్నం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం సమావేశం నిర్వహించారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా విద్యార్థులు క్రమశిక్షణగా లేకపోవడంతో 15 రోజుల క్రితం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు టీసీలు ఇచ్చిపంపారు. దీంతో ఈ పాఠశాలలో కొద్దిపాటి గందరగోళం నెలకొంది. దీంతో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తురకలాపట్నం, సానిపల్లి, ఎల్‌జిబి నగర్ తదితర గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తురకల పట్నం సర్పంచి నరేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో లేకపోతే ఎంతటి వారినైనా ఉపేక్షించకూడదని అన్నారు. అదేవిధంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యాబోధన సక్రమంగా ఉండడంతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలలో మండల మొదటి స్థానం లభించిందని అన్నారు. కొందరు అకతాయిల వల్ల పాఠశాల ప్రతిష్ట దెబ్బతినకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాసులు, నాగభూషణం, శ్రీనివాసరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**పుట్టపర్తి రూరల్ :** స్పందన కార్యక్రమంలో వారి వారి సమస్యలపై అందించిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. చట్ట పరిధిలో ఉన్న ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు స్పందనకు లో వచ్చే ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించ రాదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఎస్పీ కార్యాలయానికి 36 ఫిర్యాదులు రాగా వాటిని ఎస్పీ పరిశీలించి ఫిర్యాదుదారులతో మాట్లాడి తగిన సూచనలు అందించారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్లకు ఫోన్ చేసి పోలీసు చట్ట పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ, దిశ డీఎస్పీ వరప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ

సమావేశంలో మాట్లాడుతున్న స్పెయిన్ దేశస్తుడు

# ఆర్డీటీ సేవలను సద్వినియోగం చేసుకోండి

**బత్తలపల్లి :** వెనుకబడిన ప్రాంతాలలో ఆర్డీటీ అందిస్తున్న తోడ్పాటును ఆసరాగా చేసుకుని పేద కుటుంబాలు అభివృద్ధిలోకి వచ్చినప్పుడే సంస్థ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆశయం నెరవేర్చినట్టేనని రీజనల్ డైరెక్టర్ ప్రమీల కుమారి అన్నారు. మండలంలోని కోడే కండ్ల గ్రామంలో లబ్ధిదారులు భాగస్వామ్యంతో ఆర్డీటీ నిర్మించిన 20 గృహాలను స్పానిష్ సభ్యులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల ఆర్థిక స్థోమతను మెరుగుపర్చడమే కాకుండా వారి పిల్లల విద్యకు కోట్లాది రూపాయలను ఆర్డీటీ ఖర్చు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బండి వీరనారప్ప, నాగరాజు, తిమ్మరాజు, ఈశ్వరయ్య, ఇంజనీర్ బాసీం, అంజలి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి హయాంలో రైతులకు అన్యాయం : టిడిపి

**కనగానపల్లి :** వైసిపి ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రైతులకు అవసరమైన బిందు సేద్యం పరికరాలు, వ్యవసాయ పనిముట్లు రాయితీతో అందాయన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన వాతావరణబీమాలో మండల రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. మండలంలో అత్యధిక మంది రైతులు వేరుశనగ సాగు చేసి త్రీవంగా నష్టపోయినా ఒక్క రైతు పేరు కూడా వాతావరణబీమా మంజూరు జాబితాలో లేదన్నారు. ఇదేనా రైతు ప్రభుత్వం అంటే అని ఎద్దేవా చేశారు. బీమా జాబితాలో కేవలం చీనీ, మొక్క జొన్న, కంది పంటలు సాగు చేసిన కొంతమంది రైతుల పేర్లు చూపించి రైతులు కోసమే తాము ఉన్నట్లు ముఖ్యమంత్రి నుంచి గ్రామ స్థాయి లీడర్లు వారికి కోతలు కోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. ఈసమావేశంలో నాయకులు సుధాకర్ చౌదరి, నరసింహులు, చల్లా బాలకృష్ణ, కాసుమూర్తి వెంకటేష్, పూజారి రాజకృష్ణ, తెలుగు యువత సురేష్ చౌదరి, సుధాకర్, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

**ప్రజాశక్తి-హిందూపురం**

సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా యూనిట్ అధికారి కెసికె నాయక్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. జిల్లా ప్రభుత్వ అసుపత్రిలోని సెమినార్ హాల్‌లో సీజనల్ వ్యాధులపై ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒలకు వారం రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఇంచార్జి మలేరియా యూనిట్ అధికారి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారుల ద్వారా కార్యక్రమ నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతు కాలానుగుణంగా వ్యాపించే వ్యాధులైన డెంగీ, మలేరియా జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సచివాలయ సిబ్బంది, ఆశాల సహకారంతో లార్వా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవని అన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. డ్రైడే, ఫ్రైడేను పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు రమణ, శిక్షకులు అమర ప్రియ, రాధిక, శిక్షణ పొందుతున్న సిహెచ్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షపై శిక్షణ

**గోరంట్ల రూరల్ :** మండల పరిధిలోని నరసింపల్లి వడిగేపల్లి పాలసముద్రం సచివాలయాల పరిధిలోని వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల సచివాలయ కన్వీనర్ కసిరెడ్డి సమరసింహారెడ్డి, నాయకులు వెంకట శివారెడ్డి, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, ఆయా పంచాయతీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

**తనకల్లు :** మండల పరిధిలోని కొక్కంటీ గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూధన్ రెడ్డి, నాయకులుశ్రీనివాసులు నాయుడు, నరసింహులుతో పాటు నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

**కొత్తచెరువు :** కొత్తచెరువులో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు మానవ హక్కుల సంఘం నాయకులు పాపన్న, మండల కార్యదర్శి నాగరాజు, వెంకట రాముడు, భాస్కర తదితరులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రామాంజనేయ రెడ్డికి సోమవారం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని గతంలో పలుమార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లం నజీర్ విశ్వ సాయి పాపమ్మ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అధికారులకు సన్మానం

**లేపాక్షి :** మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన అధికారులను సోమవారం సన్మానించారు. స్థానిక వైద్యులు వెంకట చిరంజీవి ఆధ్వర్యంలో బదిలీ సిబ్బందిని సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఇఒ హుస్సేన్ బీ, ఫార్మసిస్ట్ విశ్వనాథ్, సిబ్బంది సుబ్రహ్మణ్యం, ప్రసాద్, సుదర్శన్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## ఎంఇఒగా సురేష్‌బాబు

**ఓబులదేవర చెరువు :** మండల విద్యాశాఖ అధికారిగా సురేష్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనను ప్రభుత్వ ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ 2 రమణ, ఉపాధ్యాయులు గౌస్ లాజం, సురేష్, షకుర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం

**బత్తలపల్లి :** మండల కేంద్రంలో సాయిబాబా ఆలయం, ధ్యాన మందిరం నిర్మాణానికి గుమ్మలకుంట గ్రామానికి చెందిన మాదిరెడ్డి సుధా ఉపేంద్రరెడ్డి విరాళం అందజేశారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని సాయిబాబా ఆలయానికి, షిర్డీసాయిబాబా పిరమిడ్ ధ్యాన మందిరం నిర్మాణానికి సుధా ఉపేంద్రరెడ్డి రూ.25,332లు అందజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయంలో అన్నదానానికి రూ.20,216, ధ్యాన మందిరం నిర్మాణానికి రూ.5,116లు ఆలయ కమిటీ సభ్యులు శ్రీమతమ్మ, ద్రాక్షాయణి, చిన్న మురళి, మదనాపు కొండన్న, మండల నాగేంద్రలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి. రాంభూపాల్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

## బాధితరైతుకు పరామర్శ

**బత్తలపల్లి :** తాడిమర్రి గ్రామానికి చెందిన దళిత రైతు గణేష్‌కు చెందిన చీనీచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎమ్మెస్ రాజు సోమవారం బాధిత రైతును పరామర్శించారు. ఘటనపై రైతు గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ చీని చెట్ల నరికివేత అనే విష సంస్కృతి మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూచి రాము, రాజశేఖర్ గౌడ్, ఆత్మకూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే వైసిపి ధ్యేయం

**కొత్తచెరువు :** పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం మండల పరిధిలోని పోతులకుంట మరికుంటపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఆయన ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి లోచర్ల రాజారెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు ఈశ్వర్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**పుట్టపర్తి రూరల్:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాల పరిశుభ్రత తోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పుట్టపర్తి ప్రాథమిక వైద్య సిబ్బంది సూచించారు. ఈ సందర్భంగా సోమవారం డాక్టర్ నాగరాజు నాయక్, జోష్ణ ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ మహోత్సవాల్లో భాగంగా వైద్య సిబ్బందితో కలిసి పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలంటే తమ చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, సూపర్‌వైజర్లు రమణయ్య, స్టాఫ్ నర్సులు అరుణ, అమ్మాజీ, ఫార్మసిస్ట్ నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

## దళితుల భూములు వారికే కేటాయించాలి : కెవిపిఎస్

**ప్రజాశక్తి - లేపాక్షి**

దళితుల భూములు దళితులకే కేటాయించాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కొండూరుపాలెం లో కొండూరు, చిలమత్తూరు మండలం కొర్లకుంట దళితుల భూముల వన్‌బిలో దళితుల పేర్లు చేర్చాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కెవిపిఎస్ నాయకులు రమణ మాట్లాడుతూ దళితులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన భూముల వివరాలు వారి వన్‌బిలో తొలగించడం అన్యాయమన్నారు. కుసలవా ఆర్గాన్ ప్రొడక్ట్స్ కంపెనీ రామకృష్ణ ప్రసాద్ పేరును వన్‌బిలో ఎక్కించి దళితులకు మోసం చేస్తున్న అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం చేయకపోతే కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆ భూములను ఆక్రమించి సాగు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, నారాయణ, మల్లికార్జున, గంగాధరప్ప తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

## తాగునీటి సమస్యపై రోడ్డెక్కిన మహిళలు

**ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు**

మండల పరిధిలోని భోగానిపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద కదిరి–హిందూపురం ప్రధాన రహదారిపై ఆగ్రామ మహిళలు ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొందని వాపోయారు. గ్రామంలోని బోరుబావిలో వస్తున్న అరకొర నీటితోనే సర్దుకుపోతున్నామన్నారు. ఆ బోరుబావి సైతం ఎండిపోవడంతో కొత్త బోరుబావిని తవ్వించమని స్థానిక సర్పంచుకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామంలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని స్థానిక అధికారులు చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చందన, సాలెమ్మ, ఉమాదేవి, వెంకటలక్ష్మమ్మ, రమణమ్మ, ఆదెమ్మ, నరసమ్మ, ఉత్తమ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ పరిరక్షణ కోసం 10,11న కలెక్టరేట్ వద్ద నిరసనలు

**ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్**

ఐసిడిఎస్ పరిరక్షణకు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటి ఇవ్వాలన్న డిమాండ్‌తో ఈనెల 10, 11వ తేదీలలో 36 గంటల పాటు కలెక్టరేట్ వద్ద చేపడుతున్న నిరసనలను జయప్రదం చేయాలని అంగనవాడీ యూనియన్, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు నిరసనలకు సంబంధించిన పోస్టర్లను సిఐటియు కార్యాలయం వద్ద సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, అంగనవాడీ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు మాబున్నీసా, జిల్లా ప్రధాన కార్యదర్శి వి. శ్రీదేవి, కోశాధికారి సి. శ్రీదేవి మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వారి ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జులై 10, 11న 36 గంటల పాటు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలలో భాగంగా సత్య సాయి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసనలు చేపడుతున్నామన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు ఐసిడిఎస్ పీడీకి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు చంద్రకళ, లావణ్య, సుశీల, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బకాయి నిధులను వెంటనే విడుదల చేయాలి

**ప్రజాశక్తి మడకశిర**

రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్లో పట్టు గూళ్ల అమ్మిన రైతులకు ప్రభుత్వం మూడు సంవత్సరాలు నుంచి ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ బకాయి నిధులను వెంటనే విడుదల చేయాలని పట్టుపురుగుల పెంపకం రైతులు కోరారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని అగళి లో సబ్ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ స్థాయి స్పందనలో అగళి మండలం పట్టు పెంపకం రైతులు ఈ మేరకు వినతి పత్రం అందించారు. స్పందించిన సబ్ కలెక్టర్ సంబంధిత పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు రాజు నాయక్‌తో ఇన్సెంటివ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టు పరిశ్రమ కమిషనరేట్ కు నివేదించి బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను వాడితే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - ధర్మవరం టౌన్**

పట్టణంలో చిరు, పెద్ద వ్యాపారస్తులు, తోపుడుబండ్ల వారు ప్లాస్టిక్‌ను వాడితే కఠిన చర్యలతో పాటు భారీ జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం కాయగూరల మార్కెట్, ఎన్టీఆర్ సర్కిల్ ,ప్రధాన కూడలి వద్ద గల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. సింగల్‌యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న షాపుల, తోపుడుబండ్ల వారి నుంచి ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇకముందు ప్లాస్టిక్ ని వాడితే షాపును సీజ్ చేస్తామని, కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషా, మేస్త్రి ఆంజనేయులు, మున్సిపల్ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులకు సాగుపట్టాలు ఇవ్వాలి

**పుట్టపర్తి రూరల్ :** అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు, సాగు పట్టాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ,ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గణేష్ సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు.

## ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

**ప్రజాశక్తి -పెనుకొండ**

పెనుకొండ మండలం మావటూరు గ్రామానికి చెందిన ఎస్.పరమేశ్వరప్ప భార్య వై.నాగమణి(31) సోమవారం నాడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెళ్లై 5 సంవత్సరాలు అవుతున్నా సంతానం కలుగలేదన్న మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పై కప్పుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

## స్పందన గ్రీవెన్స్‌పై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

అర్జీని స్వీకరిస్తున్న కలెక్టర్

**ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్**

జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, మండలాల్లో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమం లో ప్రత్యేక అధికారులు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ 205 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ టి ఎస్ చేతన్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ భాగ్యరేఖ, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అర్జీలకు ఎలాంటి పెండింగ్ లేకుండా పరిష్కారం చూపాలన్నారు. సత్వర పరిష్కారం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల్లో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఈనెల 29 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వై ఎస్ ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలు సెప్టెంబరు 15 లోపు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులందరూ జిల్లా కేంద్రంలోనే నివాసం ఉండాలన్నారు. ఇందులో ఎవరికి మినహాయింపు ఉండదని ఆదేశించారు.

## అక్రమ కేసులపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

**ప్రజాశక్తి - కనగానపల్లి**

రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలం లో గత నెల 26 వతేదీన జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర సందర్భంగా కనగానపల్లి మండలం, రాంపురం గ్రామంలో జరిగిన ఒక చిన్న సంఘటన ఆధారంగా టిడిపి నాయకులపై పెట్టిన అక్రమ కేసులపై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు టిడిపి నాయకులు తెలిపారు. ఈ ఘటనపై రాప్తాడు ఎమ్మెల్యే ఒత్తిడి మేరకు కనగానపల్లి ఎస్ఐ, పోలీసులు పరిటాల శ్రీరామ్ తో పాటు ఆరుగురి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, మహిళపై అక్రమ కేసులు బనాయించారన్నారు. దీంతోపాటు తూముచెర్ల గ్రామానికి చెందిన హరి అనే టిడిపి కార్యకర్త ఇంటికి అర్ధరాత్రి వెళ్లి కుటుంబ సభ్యులను బెదిరించి, అసభ్య పదజాలంతో దూషించి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ఈ సంఘటనలో హరి, కుర్లపల్లి చంద్ర అను ఇద్దరు వ్యక్తులు కర్నూలులోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కు సోమవారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఎస్ఐ నుంచి తమకు రక్షణ కల్పించాల్సిందిగా కోరారన్నారు. ఈ సందర్భంగా మానవ హక్కుల కమిషన్ వారి ఫిర్యాదును స్వీకరించి ఈ సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని మానవహక్కుల కమిషన్ ఆదేశించించినట్లు ఫిర్యాదు దారులు తెలిపారు.

## విద్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**ప్రజాశక్తి బుక్కపట్నం**

రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న అమ్మఒడి, ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమ్మ ఒడి కార్యక్రమాన్ని ప్రారంభించి నేరుగా తల్లుల ఖాతాలోకి నగదు జమ చేస్తున్నారని తెలిపారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక విప్లాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యకు ప్రాధాన్యత ఇస్తూ ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు ఇస్తూ వారిలో ఉత్తేజను నింపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రి అడ్వైజర్ ఛైర్మన్ రమణారెడ్డి, సర్పంచి నాగలక్ష్మి రాజు, జెడ్పీటీసీ శ్రీలత, తహశీల్దార్ కరుణాకర్, వైస్ ఎంపీపీ పార్వతీ, ఎంపీటీసీ పద్మావతి, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, నాయకులు రామలింగారెడ్డి. గోవర్ధన్ రెడ్డి, పతాంజలి, నారాయణస్వామి, ఈశ్వర్, మల్లికార్జున, ఆరు మండలాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

ధర్మవరంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో ప్రముఖులు

**ధర్మవరం టౌన్ :** పట్టణంలో చంద్రన్న కాంప్లెక్స్‌లో యోగా అసోషియేషన్, సాయినాథసేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు ఈశ్వరయ్యను యోగా అసోషియేషన్ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ పట్టణ అధ్యక్షులు గాజుల సోమేశ్వరరెడ్డి, సభ్యులు కట్టారవికుమార్. పులిచెర్ల రవీంద్ర, కోనాపురం సాయిప్రసాద్, రామకృష్ణ, నాగరాజు, రామాంజి, షణ్ముఖ పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని సాయినగర్ షిరిడిసాయి బాబా ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీ షిరిడి సాయిబాబా సేవా సమితి అధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాష్, సభ్యులు రాంప్రసాద్, హేమంత్ కుమార్, జీసీ నాయుడు, సూర్యనారాయణ, రామలింగయ్య, వీరనారాయణ తదితరులు ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా అన్నదానానికి సత్యసాయి జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు రూ.50వేలు విరాళంగా అందజేశారు. షిరిడిసాయిబాబా సేవా సమితి అధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాష్ హాకీ అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లను శాలువాలతో సన్మానించారు.

**సోమందేపల్లి :** మండల కేంద్రంలోని శిరిడి సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారుచేసిన లడ్డు ప్రసాదాన్ని వేలం వేయగా వ్యాపారవేత్త డిసి వెంకటేష్ కుమారుడు డిసి మారుతి 55 వేల రూపాయలకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డిసి ఈశ్వరయ్య, డిసి అశోక్, డిసి మంజునాథ్, పులివెందల నారాయణస్వామి, సుబ్రహ్మణ్యం, సుధీర్‌రెడ్డి, శివ, చిన్న రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** పట్టణంలోని కోనేరు వద్ద ఉన్న శ్రీ షిరిడి సాయి బాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకట రమణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానానికి తమవంతుగా రూ.50వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సివి కృష్ణమూర్తి, కొమ్ము విజయభాస్కర్, మండి వేణు, ఆలయ కమిటీ డైరక్టర్ నామా రాము, ఏసు, బత్తల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

**మడకశిర :** పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సాయిబాబా ప్రతిమకు ప్రత్యేక అలంకరణ చేసి వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వీరన్న తదితరులు శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కొత్తచెరువు :** కొత్తచెరువులో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# నేరాలు ఘోరాలు

## అప్పుల బాధతో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని శారదానగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అప్పులబాధతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... శారదానగర్‌కు చెందిన దంతులూరి రమణారెడ్డి (51) గతంలో చేనేత కార్మికుడుగా పనిచేస్తూ కరోనా సమయంలో మగ్గం నేయకపోవడంతో అప్పటినుంచి ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురైన రమణారెడ్డి సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి బయట ఉన్న కుటుంబ సభ్యులు ఇంట్లోకి వచ్చి ఉరివేసుకున్న రమణారెడ్డిని గమనించి బోరున విలపించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కిందకు దింపారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. మృతునికి భార్య గౌరమ్మ, ఇద్దరు కుమారులున్నారు. మృతుని భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## రైలు దొంగలు అరెస్టు

### రూ.3.35 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

**ధర్మవరం టౌన్ :** రైల్లో దొంగతనాలకు పాల్పడే ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.3.35 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు రైల్వే జీఆర్పీ సిఐ నాగరాజు తెలిపారు. సోమవారం ధర్మవరం రైల్వేజీఆర్పీ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన దొంగల అరెస్టు వివరాలను వెల్లడించారు. గుంతకల్లు రైల్వే ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు ధర్మవరం, హిందూపురం జీఆర్పీ ఎస్ఐలు గోపికుమార్, బాలాజీనాయక్, సిబ్బందితో కలిసి రెండు బృందాలుగా విడిపోయి రైలుదొంగలను అదుపులోకి తీసుకున్నామన్నారు. ధర్మవరం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద షేక్ బాబాఫకృద్దీన్‌ను, ధర్మవరం బృందం అదుపులోకితీసుకుని అతని వద్ద నుండి రూ.1.60లక్ష విలువ చేసే 24గ్రాములు బంగారు చైన్, 8 గ్రాముల ఒక బంగారు ఉంగరం స్వాధీనం చేసుకోగా, హిందూపురం బృందం పటాన్ నూర్‌బాను, షిర్డీసాయిబాబా గుడి వద్ద అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి రూ.1.75 లక్ష విలువ చేసే 22 గ్రాములు బంగారు గొలుసు, 12.5 గ్రాముల మంగళసూత్రం. 10గ్రాముల రెండు ఉంగరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా నిందితుల నుంచి ఒక ద్విచక్రవాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని సిఐ తెలిపారు.వీరిపై కేసునమోదు చేసి గుంతకల్లు కోర్టుకు తరలించామన్నారు.

## కారుడిపల్లిలో ఘర్షణ

### ఒకే కుటుంబంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**హిందూపురం :** హిందూపురం రూరల్ మండలం చౌళూరు పంచాయతీ పరిధిలోని కారుడిపల్లిలో సోమవారం ఘర్షణలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘర్షణకు అడ్డు వచ్చిన మరో ఇద్దరికి గాయాలు అయినాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఆదివారం కొంత మంది యువకులు కలిసి క్రికెట్ ఆడుకున్నారు. ఈ నేపథ్యంలో చిన్న అంగడి నిర్వహిస్తున్న మహేష్ రాజేష్ అనే వ్యక్తి ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వాలని అడిగాడు. దీంతో చిన్న ఘర్షణ జరిగింది. అక్కడే ఉన్నా కొంత మంది సర్ది చెప్పి పంపారు. సోమవారం కారుడిపల్లి గ్రామానికి చెందిన రోమన్ రెడ్డి, రాఘీ, విశ్వనాథ్ పక్కన ఉన్న కర్నాటక నుంచి కొంత మందిని తీసుకుని టిటి వ్యాన్‌లో కత్తులు, రాడ్లు తీసుకుని వచ్చి మహేష్ బంధువైన అంజినేయులు నిర్వహిస్తున్న అంగడి వద్దకు వచ్చి దాడి చేయడానికి ప్రయత్నం చేశారు. దీంతో అంజినేయులు భార్య అరుణ, అమ్మ లక్ష్మమ్మ, తండ్రి శ్రీనివాసులు అడ్డుకుని అంగడికి ఉన్న షెట్టర్ మూసి వేశారు. దీంతో దాడి చేయడానికి వచ్చిన వారు ఆ షెట్టర్‌ను పగల గొట్టి, అంగడిని ధ్వంసం చేసి, వారిపై రాడ్లు, కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో అరుణ మెడ వద్ద కత్తి పోట్లు, అంజినేయులు తలకు కత్తి పోట్లు పడ్డాయి. ఈ ఘర్షణను అడ్డుకోవాడానికి వెళ్లిన పాపిరెడ్డిపై సైతం దాడి చేశారు. స్థానికులు ఒక్క సారిగా వచ్చి అడ్డుకోవడానికి ప్రయత్నం చేయడంతో వచ్చిన వారు టిటి వ్యాన్‌లో పారిపోయారు. గ్రామస్తులు గాయపడిన వారిని ఒక వాహనంలో హిందూపురం జిల్లా అసుపత్రి తీసుకువెళ్లారు. ఈ సంఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే దాడికి ప్రధాన కారణం గ్రామంలో మొదటి నుంచి బోయ, రెడ్ల సామాజిక వర్గాల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరేనని దీంతోనే గొడవ జరిగిందని తెలుస్తోంది.

## మామిడి చెట్లు నరికివేత

**కదిరి అర్బన్ :** పట్టణ పరిధిలోని కుటాగుల సమీపాన కొండకింద ఏటిగడ్డ సమీపాన ఉన్న ఆనందం వెంకటరమణ అనే రైతు పొలంలో ఉన్న మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. నీటి కొరత ఉన్నా నాలుగు సంవత్సరాల నుండికంటికి రెప్పలా చూసి పెంచుకున్న మామిడి చెట్లను నరికి వేయడం అన్యాయమని బాధిత రైతు వాపోయాడు. అదే విధంగా ఏనుగుల రమణ అనే రైతు సంబంధించిన 20 మామిడి చెట్లను కూడా నరికి వేసినట్లు బాధితుడు తెలిపారు. ఈవిషయంతో తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## మహిళా కార్మికురాలిపై సూపర్ వైజర్ దాడి

**చిలమత్తూరు :** మండల పరిధిలోని కోడూరు గ్రామ పంచాయతీ లోని టెక్స్ పోర్ట్ గ్రార్మెంట్స్‌లోని సూపర్ వైజర్ తనపై దాడిచేశాడంటూ ఓ మహిళా కార్మికురాలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈసందర్భంగా బాధితురాలు తెలిపిన వివరాలు.. లేపాక్షికి చెందిన ఓ మహిళ కోడూరు వద్ద గల టెక్స్ పోర్ట్ సిండికేట్ గార్మెంట్స్‌లో పనిచేస్తోంది. అనారోగ్యం కారణంగా ఇంటికి ముందస్తుగా వెళేందుకు పర్మిషన్ తీసుకుంది. ఇంటికి వస్తున్నానని తన తండ్రికి ఫోన్ చేసే క్రమంలో అక్కడి సూపర్ వైజర్ పోన్ లాక్కున్నాడు. ఆ తర్వత పోన్ ఆడిగితే హెచ్ఆర్ రూం లో ఉంది తీసుకోమన్నాడు. ఫోన్ తీసుకోవడానికి వెళితే మీద పడుతూ అసభ్యపదజాలంతో మాట్లాడడని మీదపడుతున్న వ్యక్తిని వెనక్కి తోయడంతో చెంపపై కొట్టాడని బాధిత మహిళ వాపోయింది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**గోరంట్ల రూరల్:** బెంగళూరు – హైదరాబాద్ జాతీయ రహదారిలో పాలసముద్రం క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్ నాయక్ తెలిపిన వివరాలు... సోమందేపల్లి మండలం కొనతట్టుపల్లికి చెందిన దళిత భావన్న (60), సుధాకర్ అనే వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వస్తుండగా వారి వాహనం పాలసముద్రం క్రాస్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహనం వెనకవైపున కూర్చున్న భావన్న అక్కడికక్కడే మృతిచెందాడు. సుధాకర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. సుధాకర్ ను 108 సాయంతో మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుండెపోటుతో సింగిల్‌విండో సిఇఒ మృతి

**రొద్దం :** సింగిల్ విండో సిఇఒ, రొద్దంగ్రామ వాసి శ్రీనివాసులు (57) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. ఈయన రొద్దం సొసైటీలో చాలాకాలం సిఇఒగా పనిచేసి ఇటీవలే బదిలీ పై సోమందేపల్లికి వెళ్లారు. శ్రీనివాసులు మృతివార్త తెలిసిన వెంటనే ఎంపిపి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, స్వచ్ఛాంధ్ర స్టేట్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, ఆర్ఎ రవిశేఖర్ రెడ్డి, రాజారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత తదితరులు మృతదేహానికి నివాళులు అర్పించారు.

## టీడీపీ కార్యకర్త మృతి

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని 27వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త శంకర ఓబుళేశు(40) గుండెపోటుతో ఆదివారం రాత్రి మతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆ వార్డు టీడీపీ నాయకులు బొట్టుకిష్ట, పరాన్ బాబుఖాన్, సీబీఎన్ రామకృష్ణ, పాలెం తిరుపాల్ తదితరులు మతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శిం చారు.

## ఎంఇఒగా కిరణ్మయి

**ముదిగుబ్బ :** ఎంఇఒగా కిరణ్మయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమెకు మండల ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ అందరి సహకారంలో మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.